www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

**నిబంధనలు బేఖాదర్... అంతానాఇష్టం..?**



3

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 268 | గురువారం | 27- 02 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## రెచ్చిపోయిన ఉగ్రవాదులు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : శ్రీనగర్ : జమ్మూ కశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజౌరీ జిల్లాలోని నియంత్రణ రేఖ సమీపంలో ఆర్మీ జవాన్లను తీసుకు వెళు_న్న ట్రక్‌ను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అయితే ఈ కాల్పుల్లో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. బుధవారం సుంద ర్‌బనీ సెక్టార్‌లో పాల్ గ్రామం వద్ద ఈ ఘటన చోటు చేసుకుందని వారు వివరించారు. అటవీ ప్రాంతంలో నక్కిన

2

### సరిహద్దుల్లో వాహనాలపై

## క్రిమినాశిని పిచికారి



తొలిఅడుగు డెస్క్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి అధికంగా ఉంటోంది. ఆంధ్ర రాష్ట్రం పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు, కర్నూల్ జిల్లాల్లోని 30కి పైగా ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి వేలాది కోళ్లు మృతిచెందుతున్నాయి. ఆంధ్ర సరిహద్దు రాష్ట్రం కావడంతో, రాష్ట్రంలోకి బర్డ్ ఫ్లూ వ్యాపించకుండా ఆరోగ్యశాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు ముందు జాగ్రత్తలు చేపట్టారు. ఈ ప్రకారం, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులైన తిరువళ్లూర్ జిల్లాలోని తిరుత్తణి

2

### ప్రధాని మోదీతో..

## సీఎం రేవంత్ రెడ్డి భేటీ



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు.. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన రేవంత్ రెడ్డి పలు విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా టన్నెల్ సహాయక చర్యల గురించి ప్రధాని మోదీకి సీఎం వివరించారు.

2

### వర్క్ ఫ్రమ్ హెూమ్ కల్చర్

## మరింత విస్తరించాలి



తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక నూతన కార్యక్రమాలకు

2

### టన్నెల్ ప్రమాదాన్ని కూడా

## రాజకీయం చేస్తున్నారు



తొలిఅడుగు, హైదరాబాద్ : ప్రతిపక్షాలు ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదాన్ని కూడా రాజకీయం

2

# హైదరాబాద్‌లో పోసాని అరెస్ట్

- జనసేన నేత ఫిర్యాదుతో పోసానిపై కేసు
- రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై పదికిపైగా కేసులు
- అరెస్టు సమయంలో పోలీసులతో వాగ్వాదం
- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న 'అన్నమయ్య' పోలీసులు



తొలిఅడుగు, హైదరాబాద్ : వైసీపీ అధికారంలో ఉండగా... టీడీపీ, జనసేన అగ్రనేతలపై పిచ్చిపిచ్చిగా రెచ్చిపోయి, అడ్డూ అదుపూ లేకుండా నోరు పారేసుకున్న సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మైహెూం భూజా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పోసాని కృష్ణ మురళి నివాసానికి వెళ్లి... నోటీసులు అందించి, అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు పోలీసులు హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులను కలిసి... పోసాని కృష్ణ మురళిపై

2

# మరో రెండు కేసులు

**పోలీసుల విచారణలో... తెలీదు, మరిచిపోయా, గుర్తులేదు..**



తొలిఅడుగు, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఏపీ సిట్ పోలీసులు షాక్ ఇచ్చారు. అతనిపై మరో రెండు కేసులు నమోదు చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో రైతులకు ప్రభుత్వం అందించిన పరిహారం అందించకుండా 128 మంది రైతులను మోసం చేయడంపై కేసు నమోదు చేశారు. అలాగే తెలప్రోలుకు చెందిన శ్రీధర్ రెడ్డి వివాదం సెట్టిల్మెంట్‌లో పొలం రిజిస్ట్రేషన్ చేయిస్తానంటు భూమిని కబ్జా చేసినందుకు వంశీ ఆయన అనుచరులుపై మరో కేసు నమోదు అయింది. సీట్ ఏర్పాటు తరువాత నిన్న ఒక్క రోజే గన్నవరం నియోజకవర్గంలో వంశీ ఆయన అనుచరులుపై మొత్తం మూడు కేసులు నమోదు నమోదయ్యాయి. వంశీపై నమోదైన కేసుల అన్ని సీట్‌కు ఇవ్వాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

**తెలీదు.. మరిచిపోయా.. గుర్తులేదు..**

పోలీసుల విచారణలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ 'అదుర్స్' సినిమా చూపించారు. వంశీనే నిర్మించిన అదుర్స్ సినిమాలో

2

### మహాశివరాత్రి వేళ తెలుగు రాష్ట్రాల్లో


# విషాద ఘటనలు



తొలిఅడుగు, తూర్పుగోదావరి : శివరాత్రి వేళ పలు చోట్ల విషాదం నెలకొంది. వేర్వేరు ఘటనల్లో స్నానాలకు వెళ్లిన సమయంలో గల్లంతై ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. తూర్పుగోదావరి జిల్లా తాడిపూడిలో ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. ఇసుక ర్యాంపులో గోదావరి నదీ స్నానానికి దిగడంతో ప్రమాదం జరిగింది. ఉదయం నుంచి ఐదుగురు యువకుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టగా.. ఎట్టకేలకు ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులు తిరుమల శెట్టి పవన్, పడాల దుర్గాప్రసాద్, అనిసెట్టి పవన్, గర్రె ఆకాష్, పడాల సాయిగా గుర్తించారు. తాడిపూడి గ్రామానికి చెందిన మొత్తం 11 మంది యువకులు నదీ స్నానానికి వెళ్లారు. వీరంతా ఇసుకతిన్నెల మీద నడుచుకుంటూ వెళ్లి గోదావరిలో స్నానానికి దిగారు. అయితే అక్కడ పెద్ద గొయ్యి ఉండటంతో వారంతా అందులో చిక్కుకున్నారు. అయితే 11 మందిలో ఆరుగురు

2

## ఐదోరోజు కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



తొలిఅడుగు,డెస్క్ : టన్నెల్‌లో చిక్కుకున్న 8మందిని కాపాడేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. షిఫ్టుకి వందమందికి పైగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులుగా నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయి. అందర్నీ సజీవంగా తీసుకొచ్చేందుకు 11 సంస్థలు శ్రమిస్తున్నాయి. గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా లోపలికి చేరుకునేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి.

2

## దొంగ బాబాల ఉచ్చులో మహిళలు



తొలిఅడుగు, కడప : కడప జిల్లా శేషాచల పర్వత శ్రేణుల్లోని పొలతల క్షేత్రంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతోన్నాయి. శ్రీమల్లిఖార్జున స్వామి వారి దర్శనానికి భక్తులు బుధవారం పోటెత్తారు. అయితే దేవుడిపై నమ్మకంతో వచ్చే భక్తులను దొంగ బాబాలు, మంత్రగాళ్లు నిలువునా ముంచేస్తున్నారు. అంతేకాదు వారి ముఢ నమ్మకాలను క్యాష్ చేసుకొంటున్నారు. ఏటా పొలతల క్షేత్రంలో


2

# రెచ్చిపోయిన ఉగ్రవాదులు

ఉగ్రవాదులు ఈ కాల్పులు జరిపారని చెప్పారు. ఈ ప్రాంతం నుంచే జమ్మూ కశ్మీర్‌లోకి ఉగ్రవాదులు చొరబడతారని ఆర్మీ ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు భద్రతా దళాలు సైతం అదే సమయంలో ఉగ్రవాదులపైకి ఎదురు కాల్పులకు దిగాయన్నారు. ఈ కాల్పుల ఘటనపై ఆర్మీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. హుటాహుటిన భద్రత దళాలు రంగంలోకి దిగాయి. అందులోభాగంగా ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కోసం గాలింపుతోపాటు తనిఖీ కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.

గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలోని పార్టీలు ఘన విజయం సాధించాయి. దీంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోంది. అదే సమయంలో జమ్మూ కశ్మీర్‌లో రియాసీ జిల్లాలోని శివ్ ఖోడీ ఆలయాన్ని సందర్శించుకొని.. కాట్రాకు యాత్రికులతో వెళ్తున్న బస్సుపై పోని ప్రాంతంలోని తెర్యాత్ గ్రామం వద్ద ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.

ఉగ్రవాదుల కాల్పుల నుంచి తప్పించేందుకు డ్రైవర్.. బస్సు వేగాన్ని పెంచాడు. దీంతో ఆ బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో పదిమంది యాత్రికులు అక్కడికక్కడే మరణించగా.. మరో 33 ప్రయాణికులు గాయపడ్డారు. ఆ నాటి నుంచి జమ్మూ కశ్మీర్‌లో ఎక్కడో అక్కడ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు మరణిస్తున్నారు. మరోవైపు గతేడాది జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అది కూడా ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఈ ఎన్నికలు జరగడంతో.. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ


మొదటిపేజీ తరువాయి

కట్టారు. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి ఓటర్లు పట్టం కట్టారు. దీంతో ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకోవైపు జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం ఏర్పాటైనా.. అడపాదడపా ఉగ్రవాదులు రెచ్చి పోతుండడం పట్ల ఆ రాష్ట్ర ప్రజలు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మహాశివరాత్రి వేళ తెలుగు రాష్ట్రాల్లో విషాద ఘటనలు

మొదటిపేజీ తరువాయి బయటపడగా.. ఐదుగురు మాత్రం గల్లంతయ్యారు. బయటపడిన యువకుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు వారి మృతదేహాలను వెలికితీశారు. చనిపోయిన వారంతా పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల యువకులే. ఐదుగురు యువకులు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో అక్కడ విషాదఛాయలు నెలకొన్నాయి. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వర్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుష్మిత పరిశీలించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, పరిహారం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు.

**– తండ్రీ, కొడుకు మృతి**

అటు శ్రీశైలం ప్రాజెక్ట్ సమీపంలో లింగాలగట్టు వద్ద స్నానాలు చేసేందుకు వెళ్లి ముగ్గురు గల్లంతయ్యారు. ఈ ఘటనలో తండ్రీ, కొడుకు మృతి చెందగా, ఒకరిని మత్స్యకారులు కాపాడారు.

**– 50 ఏళ్ల వ్యక్తి గల్లంతు**

తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎర్రాయిపేటలోనూ విషాదం నెలకొంది. గోదావరిలో మునిగి 50 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గోదావరిలో నీటి ప్రవాహం లేనపట్టికీ ఇసుక కోసం జరిగిన తవ్వకాల్లో గుంతలు ఏర్పడ్డాయి. నీటితో నిండిన గుంతల్లో భక్తులు స్నానాలు చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు పారుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మహాశివరాత్రి సందర్భంగా అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇసుక తవ్వకాల వల్ల గల్లంతైన బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. మహాశివరాత్రి రోజు భక్తుడు చనిపోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది.



# వర్క్ ఫ్రమ్ హెూమ్ కల్చర్ మరింత విస్తరించాలి

మొదటిపేజీ తరువాయి శ్రీకారం చుడుతోంది. ప్రతి రంగంలోనూ కొత్తకొత్త ఆలోచలనతో ముందుకెళ్తోంది. "స్వర్ణాంధ్ర విజన్- 2047, బ్రాండ్ ఏపీ" లక్ష్యంగా దూసుకెళ్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. ప్రతి ఒక్కరికీ ఏదో ఓ మంచి చేయాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు అర్హులకు వర్క్ ఫ్రమ్ హెూమ్ అవకాశాలు కల్పించేందుకు తాజాగా చర్యలు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లో వర్క్ ఫ్రమ్ హెూమ్ కల్చర్ మరింత విస్తరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు వర్క్ ఫ్రమ్ హెూమ్‌కు సంబంధించి తాజాగా సర్వే చేపట్టింది. ప్రతి ఇంట్లో 18 నుంచి 50 ఏళ్ల లోపు ఉన్నవారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు సేకరిస్తున్నారు. టెక్నికల్ స్కిల్స్, విద్యార్హతలు సహా ప్రస్తుతం చేస్తున్న పనికి సంబంధించిన వివరాలనూ తెలుసుకుంటున్నారు.

# దొంగ బాబాల ఉచ్చులో మహిళలు

మొదటిపేజీ తరువాయి దొంగ బాబాలు చెలరేగి పోతారు. దెయ్యాలను తొలగిస్తామంటూ జనానికి దొంగబాబాలు టోపి పెడుతోన్నారు. మీ ఒంట్లో దెయ్యముంది.. వదిలిస్తామంటారు. మీ ఆరోగ్యాన్ని కుదుట పడేలా చేస్తామని చెబుతారు. అలాగే ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కిస్తామంటారు. ముఖ్యంగా ఆడవాళ్లను బుట్టలో పడేసి భయపెడతారు. వారి మాయ మాటలు నమ్మి పూజలో కూర్చొన్న భక్తులకు దొంగ బాబాలు నరకం చూపిస్తారు. మహిళల జుట్టు పట్టుకొని ఇష్టం వచ్చినట్లు కొడతారు. కాళ్లతో తంతూ..శాడిస్ట్‌లాగా ప్రవర్తిస్తారు. దెయ్యాన్ని వదిలిస్తామంటూ మూడేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల ముసలమ్మ వరకు అందరిని హింసిస్తారు.

దెబ్బలు తట్టుకోలేక బాధితులు ఆర్తనాదాలు పెడుతోంటే.. వారి కుటుంబ సభ్యులు మాత్రం అది చూస్తూ ఆనందిస్తారు. నిజంగానే దెయ్యం వదిలి వెళ్లిపోతుందని నమ్ముతుంటారు. అలాగే ఈ ఏడాది సైతం దొంగ బాబాల ఉచ్చులో పడి జనాలు ఒళ్లు హూనం చేసుకున్నారు. అంతే కాదు.. రూ. 5 వేలు నుంచి రూ. 10 వేల వరకు జేబు గుల్ల చేసుకున్నారు. శివరాత్రి వేళ.. దొంగ బాబాలు, మంత్రగాళ్లు చెలరేగిపోతున్నా.. పోలీసులు కానీ.. ప్రభుత్వాధికారులు కానీ చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

# టన్నెల్ ప్రమాదాన్ని కూడా రాజకీయం చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి దేశంలోనే టన్నెల్ అంశంలో అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఉన్న ఆర్మీతో చర్చించామని చెప్పారు. ఇవాళ(బుధవారం) ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. దేశ సరిహద్దులో టన్నెల్ నిర్మించిన నిపుణులను టన్నెల్ లోపలకు పంపి రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేశామని అన్నారు. 200 మీటర్ల వరకు మట్టి, నీరు కలిసి... బురద పేరుకుపోయిందని.. దీని కారణంగా కొంతమేర ఆటంకం ఏర్పడింది వాస్తవమేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# హైదరాబాద్‌లో పోసాని అరెస్ట్

నమోదైన కేసు వివరాలను అందించారు. ఆయన అరెస్టుకు ఎస్కార్ట్ కల్పించాలని కోరారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్ఐ, ఒక కానిస్టేబుల్ ఏపీ పోలీసులకు తోడుగా వెళ్లారు. రాత్రి 8.45 గంటల సమయంలో మైహెూం భూజాలోని పోసాని నివాసానికి వెళ్లి, ఆయనను అరెస్టు చేశారు. ఆయనను గురువారం రాజంపేట కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.

**– పోలీసులతో వాగ్వాదం...** అరెస్టు సమయంలో పోసాని పోలీసులకు సహకరించకుండా వాగ్వాదానికి దిగారు. 'నోటీసులు తీసుకోను. అరెస్టు చేసుకోండి. ఆడవాళ్ల మీద రౌడీయిజం చేస్తారా?' అంటూ నోరు పారేసుకున్నారు. 'మీరెవరు? ఎలా మా ఇంటికి వస్తారు?' అని ప్రశ్నించడంతో... తాము అన్నమయ్య జిల్లా పోలీసులమని ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. అరెస్టు చేస్తున్నాం... సహకరించండి అని కోరారు. "ముందు నాకు నోటీసు ఇవ్వండి. నేను ఆస్పత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకుని... తర్వాత మీ దగ్గరికి వస్తాను" అని పోలీసులకు సూచించారు. అలా కుదరదని, అరెస్టుకు సహకరించకపోతే తమ డ్యూటీ తాము చేయాల్సి వస్తుందని పోలీసులు స్పష్టం చేశారు.

# వాహనాలపై క్రిమినాశిని పిచికారి

మొదటిపేజీ తరువాయి పొన్‌పాడి, ఊత్తుకోట పెరియపాళ్యం, గుమ్మిడిపూండి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. పశుసంవర్ధక శాఖకు చెందిన ఒక అసిస్టెంట్ డాక్టర్, ఇన్స్‌పెక్టర్, అసిస్టెంట్ మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ, ఆంధ్ర రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేసి, వాటికి క్రిమినాశిని మందు పిచికారి అనంతరమే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు.

# ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

దీంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల జాబితాను ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి అందజేశారు.. ప్రధానంగా 5 అంశాలపై వినతులు సమర్పించారు సీఎం రేవంత్ మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవం, ట్రిపుల్ ఆర్‌తో పాటు ఫ్యూచర్ సిటీకి సాయం చేయాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేస్ 2 కోసం రూ. 22 వేల కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.. రీజనల్ రింగ్ రోడ్డులో దక్షిణ భాగాన్ని కూడా మంజూరు చేయాలని కోరారు.. డ్రై పోర్ట్ నుంచి బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే తో పాటు సమాంతరంగా గ్రీన్ఫీల్డ్ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. మూసీ పునరజ్జీవన ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వాలన్నారు. గుజరాత్ సబర్మతి ప్రాజెక్టు మాదిరిగా మూసి ప్రాజెక్టు ఉంటుందని.. గోదావరి నదిని మూసితో అనుసంధానించి స్వచ్ఛమైన జలాలను అందించాలని కోరారు. 27 కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాలు మంజూరు చేయాలన్నారు. వరద నివారణకు రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, కరకట్టల బలోపేతం చేయాలని.. దీనికోసం నిధులు కేటాయించాలని కోరారు.

– సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ సూచనలు..

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ సూచనలు చేశారు. 2017 నుంచి 2022 వరకు పెండింగ్ అంశాలపై.. దృష్టిపెట్టాలని సీఎం రేవంత్‌కి ప్రధాని మోదీ సూచించారు. ప్రధాని ఆవాస్ యోజన గ్రామీణపథకం.. తెలంగాణలో అమలు కావడం లేదని.. 2025 మార్చి 31 నాటికి సర్వే పూర్తి చేసి.. అర్హులను గుర్తించాలని సీఎం రేవంత్‌కి సూచించారు. శంషాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి రూ.150 కోట్లు చెల్లించాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో.. 3మొబైల్ కనెక్టివిటీప్రాజెక్టులు పెండింగ్‌లోఉన్నాయని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌కి విద్యుత్, వాటర్ సప్లై కోసం.. రూ.1365.95 కోట్లు చెల్లించాలని సూచించారు. తెలంగాణలో రెండు రైల్వే ప్రాజెక్టల కోసం.. అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు నీటి పారుదల ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం అంచనాలను సవరించి పంపాలని మోదీ సూచించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ ప్రాజెక్టులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# మరో రెండు కేసులు

మొదటిపేజీ తరువాయి హీరో కొన్ని సందర్భాల్లో 'తెలీదు.. గుర్తులేదు.. మరిచిపోయా' అని సమాధానాలు చెబుతాడు. ఈ డైలాగులనే పోలీసులు అడిగిన ప్రశ్నలకు.. "తెలీదు, గుర్తులేదు, మరచిపోయా" అని జవాబులు ఇచ్చినట్టు సమాచారం. గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో ప్రధాన నిందితుడు వల్లభనేని వంశీమోహన్, ఏడో నిందితుడు వెలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్, ఎనిమిదో నిందితుడు నిమ్మ లక్ష్మీపతిని విజయవాడ జిల్లా జైలు నుంచి పోలీసులు మంగళవారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. ముందుగా ముగ్గురు నిందితులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం అక్కడి నుంచి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ముగ్గురు నిందితులను విచారించడానికి ముగ్గురు ఏసీపీలు రంగంలోకి దిగారు. వల్లభనేని వంశీని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ విచారించారు. వరామకృష్ణప్రసాద్‌ను ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్‌గౌడ్, లక్ష్మీపతిని సీసీఎస్ ఏసీపీ వెంక టేశ్వరరావు ప్రశ్నించారు. ఒక్కొక్క అధికారి ఒక్కొక్క నిందితుడికి సుమారు 30 ప్రశ్నలు సంధించారు. రెండు గంటల పాటు వారిని విచారించారు. కాగా.. విచారణా ధికారి అడిగిన ప్రశ్నలకు కొన్నింటికి మాత్రమే వంశీ సమాధానాలు చెప్పారు. చాలా వాటికి అబద్ధాలు చెప్పారని విచారణాధికారులు భావిస్తున్నా రు. సత్యవర్ధన్ తనకు తెలియదని ముందుగా సమాధానమిచ్చారు.

# ఐదోరోజు కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

మొదటిపేజీ తరువాయి ముఖ్యంగా రెస్క్యూ సిబ్బందికి టీబీఎం చాలెంజింగ్‌గా మారింది. ప్రమాదం జరిగిన దగ్గర టీబీఎం ముక్కలై దాని విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అక్కడ రెస్క్యూ చేయాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఓవైపు బురద, ఇంకోవైపు సీపేజ్ వాటర్, మరోవైపు టీబీఎం ముక్కలతో అత్యంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్యాస్ కట్టర్లను ఉపయోగించి తీసేసే ప్రక్రియను జరపాలన్నా.. ఉబికి వస్తున్న నీరు ప్రతిబంధకంగా మారింది. ఇక రెస్క్యూ ఆపరేషన్లో.., ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ పాలుపంచుకుంటున్నాయి. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ర్యాట్ హెూల్ మైనర్స్, సింగరేణి, హైడ్రా టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ మరికొన్ని కంపెనీలు తమ సేవలను అందిస్తున్నాయి. మొత్తం 11 ఏజెన్సీలు నిరంతరం కోఆర్డినేషన్ చేసుకుంటూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

# నిబంధనలు బేఖాదర్... అంతానాఇష్టం..?

- గాజులరామారం కైలాష్ హిల్స్ లో అదనపు అంతస్థులతో అక్రమనిర్మాణం..
- కాసులు కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు.
- కాసులకి కక్కుర్తిపడి .అక్రమాలకు అండగా టౌన్ ప్లానింగ్.
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, అందినకాడికి దండుకుంటున్న వైనం..
- అక్రమ నిర్మాణాలతో జి హెచ్ యమ్ సి ఆదాయానికి భారీగా గండి..



తొలి అడుగు,ఫిబ్రవరి 25,కుత్బుల్లాపూర్,(ప్రతినిధి):- కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజులరామారం సర్కిల్ 26,కైలాస్ హిల్స్ లో అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారింది అనడంలో ఎలాంటి సందేహాములేదు. అందుకు ఇక్కడి బాధ్యతలు మరిచిన టౌన్ ప్లానింగ్ అధికారులే కారణం అంటున్నారు స్థానిక ప్రజలు. అందులోభాగంగా అక్రమ భవన నిర్మాణదారులతో స్థానిక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అక్రమ నిర్మాణదారులు ఇచ్చే అమ్య అమ్య లకు కక్కుర్తిపడి అక్రమ నిర్మాణాలకు అండ గా నీలుస్తున్నారాని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 2అంతస్థుల అనుమతులతో ఐదు అంతస్తులు మరియు పెంట్ నిర్మస్తూ ఎలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అని బహాటంగా అనుకుంటున్నారు. అక్రమనిర్మాణలపై ఫిర్యాదులు అందుతున్నా, పలు వార్తాపత్రికల్లో వార్తా కథనాలు వెలువడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పేదవాడు కట్టుకుంటే మాత్రంనిబంధనలు, అనుమతులు అని అడ్డుపడుతారు మరి ఇఅక్రమ నిర్మాణాలపై చెర్యలు ఉండవా అని ప్రశినిస్తున్నారు ఇలాంటీ నిర్మానాలపై క్షేత్రస్తాయిలో మున్సిపల్ పై అధికారులు పరిశీలించి ఇ అక్రమాలపై చెర్యలు తీసుకొని జి హెచ్ యమ్ సి అదాయానికి గండి పడకుండా చూడాలని వీటిపై వారికి సహకరిస్తున్న టౌనప్లానింగ్ అధికారుల పై తక్షణమే చెర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# సలంద్రి శివాలయం దర్శించిన హరీష్ రావు



తొలి అడుగు, చిన్నకోదూరు, ఫిబ్రవరి 26 : చిన్నకోదూరు మండలం సలంద్రి గ్రామం లో వెలసియున్న శ్రీ శివాలయం లో స్వామి వారిని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు బుదవారం సందర్శించారు. గత ప్రభుత్వం లో ఆలయ అభివృద్ధి కి రూ. 50 లక్షలు మంజూరు చేసామని త్వరలోనే పనులు ప్రారంభం చేసేలా కృషి చేస్తానన్నారు. ఆలయం దిన దినాభివృద్ధి జరగాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్ధించారు.

# ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం:

- ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, కల్వకుర్తి శాసనసభ్యులు కశిరెడ్డి నారాయణ రెడ్డి:





తొలిఅడుగు, కల్వకుర్తి, ఫిబ్రవరి 26 : రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామ శివార్లో ఎత్తైన కొండపై వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణం బుధవారం కన్నులపండువగా కొనసాగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మల్లన్న గుట్టపై శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం దేవాలయ చైర్మన్ కౌసల్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు మాకం పాండయ్య అధ్వర్యంలో కన్నులపండువగా స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు పెద్ద పీట వేస్తుందని వారు కొనియాడారు. మల్లప్ప గుట్టను అన్ని హంగుళాలలో అభివృద్ధికి స్థానిక నాయకులు గ్రామాల పెద్దలతో కలిసి అభివృద్ధి చేసుకోవాలని అలాగే ఇక్కడి దేవాలయ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో చర్చించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుల్ల రాజేష్, ఫూడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్,బిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, ఏఎంసీ చైర్మన్ యాట గీత-నరసింహ,కాంగ్రేస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి,కాసు శ్రీనివాస్ రెడ్డి,ఎమిరెడ్డి పాండురంగ రెడ్డి,ఎమిరెడ్డి రంగారెడ్డి, పెంటరెడ్డి, దామోదర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


# మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

- బాధిత కుటుంబాలకు భరోసాగా మాజీ జడ్పిటీసీ దశరథ్ నాయక్



తొలిఅడుగు, కల్వకుర్తి, ఫిబ్రవరి 26 : కడ్తాల్ మండలంలో పలు మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తోపాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ముందుగా కడ్తాల్ మండల కేంద్రంలో మంగళవారం మరణించిన మంకీ మైసమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన కిష్టమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మైసమ్మ, కిష్టమ్మ కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చెరో 5000 రూపాయలు చొప్పున 10000 రూపాయల ఆర్థిక సాయం అందించగా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కూడా రెండు కుటుంబాలకు 10,000 ఆర్థిక సాయం అందించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి మైసమ్మ కుటుంబానికి 5,000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఇటీవల పలు ప్రమాదాల్లో గాయపడిన కూకుంట్ల శ్రీను, బోసు రాఘవేందర్ లను మండల బీఆర్ఎస్ నాయకులు పరమర్శించారు. అనంతరం వారికి 15 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ కేశని మహేష్ చేకూరి మహేష్ క్యామ వెంకటేష్ సిద్దిగారి వెంకటేష్ అంజి శ్రీకాంత్ సురేష్ రాజా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణోత్సవ వేడుకలో పాల్గొన్న తలకొండపల్లి మాజీ ఎంపీపీ సి ఎల్ శ్రీనివాస్ యాదవ్



తొలిఅడుగు, కల్వకుర్తి, ఫిబ్రవరి 26 : తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో వెలిసిన మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి కళ్యాణ మహెూత్సవానికి కల్వకుర్తి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పురస్కరించుకున్నారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ ప్రశాంత్, మహేష్ నేత, అరుణ్, కుమార్ గౌడ్, రాజు, తరుణ్, మణికంఠ తదితరులు ఉన్నారు.


# రూపాయికి టారిఫ్‌ల సెగ



తొలిఅడుగు, అమెరికా టారిఫ్ యుద్ధ అనిశ్చితికి తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ మరింత పతనమైంది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం.. ఎఫ్ఐఐలు తరలిపోవడంతో నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.23కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 86.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 87.23కి పడిపోయింది. తుదకు 51 పైసలు కోల్పోయి 87.23 వద్ద ముగిసింది. ముడి చమురు బ్యారెల్ ధర 0.12 శాతం తగ్గి 74.69 వద్ద ముగిసింది. సోమవారం సెషన్‌లో రూ.6,286.70 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. ఈ నెల దాదాపు రూ.30 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే డాలరుతో రూపాయి విలువ 90కి చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని నిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌కు ట్రంప్ ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామి అని గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి ట్రంప్ టారిఫ్‌ల చర్యలతో రూపాయి పతనం, మార్కెట్ల క్షీణతతోనైనా మేలుకొలుపు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బిసిల చాంపియన్ శివశంకర్

తొలిఅడుగు, : తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు.కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు. 1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటీ ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం. హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974–75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జీన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మద్యలో ఆయన విదేశీ



శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988–89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు. ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు. ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది. రాజీవ్ హాయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు

ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక 2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , ఫూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు.ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే. నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశములో అత్యంత శక్తివంతమ్మైన వ్యక్తి” 1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాని బట్టి శివశంకర్ పలుకుబడి ఏ పాటిదో చెప్పకనే చెపుతుంది

# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం

తొలిఅడుగు, : భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన “పండిత్‌జీ”గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బావ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు ‘ఆజాద్’ అని, తన తండ్రి పేరును ‘స్వతంత్రం’, తన నివాసం ‘జైలు’ అని చెప్పాడు. “మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందు డైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో ‘15 కొరడాల దెబ్బల’ శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు ‘చంద్ర శేఖర్ ఆజాద్’ గా మారింది. “సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహెూర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. “నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో” – ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. “నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను” అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో ‘ఆజాద్’ వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

భూతాపం.. మానవాళికి పెనుశాపం

ప్రజలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు, వాతావరణ మార్పులకు శిలాజ ఇంధనాల వినియోగమే చాలా వరకు కారణం. సాంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో క్లీన్ ఎనర్జీని ఉపయోగించడమే పర్యావరణ సంబంధిత సమస్యలకు విరుగుడు. వాతావరణ మార్పులపై ప్రపంచ దేశాలు బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని కనీస స్థాయికి తగ్గించకపోవడమే ఒక ఉదాహరణ. అడవులను నరికివేయడం, పచ్చదనం పెంచడానికి సరైన ప్రణాళికలు రూపొందించి ఆచరించకపోవడం, పట్టణీకరణపై మక్కువ, చూపడం, వాయు కాలుష్యం పెరగడం వంటి ఎన్నో కారణాలు భవిష్యత్‌లో సంభవించబోయే విపత్కర పరిణామాలను సూచిస్తున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యావరణానికి పెద్దదెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ'పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తున్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోకతప్పదు. పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతలను 2 డిగ్రీల సెల్సియస్ దిగువ స్థాయికి తగ్గించడం, సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కి పరిమితి చేయాలన్న ఆలోచనతో పారిస్ ఒప్పందం కుదిరింది. ఐక్యరాజ్య సమితిలోని మెజారిటీ సభ్యదేశాలు వాతావరణ మార్పులపై ఆందోళన చెంది, గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఆమోదించిన ఒప్పందాన్ని అంగీకరించడం జరిగింది. పారిస్ ఒప్పందం 2016 వ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది. గతంలో డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలో ఉన్నప్పుడు పారిస్ ఒప్పందం నుండి వైదొలగడం జరిగింది. జో బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అమెరికా తిరిగి పారిస్ ఒప్పందంలో చేరింది. ట్రంప్ ఈ సంవత్సరం అధికారంలోకి వచ్చాక తిరిగి పాత పాటే పాడుతూ పారిస్ ఒప్పందం నుండి తప్పుకున్నారు. తమ దేశ అవసరాలకు ఖనిజ ఇంధనాన్ని వాడుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచానికి దశాదిశా నిర్దేశం చేయవలసిన అమెరికా తన తొందరపాటు నిర్ణయాలతో ప్రపంచాన్ని సాంప్రదాయేతర ఇంధనాల వనరుల వాడకం నుంచి శిలాజ ఇంధనాల వాడకంపై తిరిగి దృష్టి సారించేలా నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ఇప్పటికే మన చుట్టూ ఉన్న వాతావరణం పరిమితికి మించిన హానికరమైన వాయువులతో నిండిపోయింది. ప్రజలు వాయు కాలుష్యంతో, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. శిలాజ ఇంధనాల వాడకం అతి ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తున్నది. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు మొదలైనవి శిలాజ ఇంధనాలు. భారత దేశంలో బొగ్గు తర్వాత ప్రధాన ఇంధన వనరు పెట్రోలియం. పెట్రోలియం అనే పదం పెట్రా, ఓలియం అనే లాటిన్ పదాల నుండి ఏర్పడింది. పెట్రోలియం అనగా రాతి నూనె అని అర్థం. శిలాజ ఇంధనాలు చెట్లు, జంతువుల అవశేషాల నుండి ఏర్పడతాయి. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాలను వినియోగించిన తర్వాత తిరిగి భర్తీ కావడానికి లక్షల సంవత్సరాల కాలం పట్టవచ్చు. ఇవి తరిగేపోయే శక్తి వనరులు. చైనా శిలాజ ఇంధనాల వినియోగంలో ప్రపంచంలోనే అత్యధిక శాతం వాటా కలిగి ఉంది. అమెరికా కూడా చైనాతో సమానంగా ఫోసిల్ ఫ్యూయల్ వినియోగిస్తున్నది. ఈ విషయంలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానం లో ఉంది. కాలుష్యకారకంగా భావిస్తున్న చమురు వినియోగంలో భారత్ చైనా స్థానాన్ని అధిగమించబోతుందనే అంచనాలున్నాయి. బొగ్గు వినియోగంలో భారత్ ఇప్పటికే యూరప్, ఉత్తర అమెరికా దేశాలను అధిగమించింది. భారత దేశం గ్రీన్ ఎనర్జీపై దృష్టి సారించాలని నిర్ణయించినా దీనికి తగ్గ కార్యాచరణ పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ప్రపంచ ఇంధన వినియోగంలో 80 % పైగా చమురు, బొగ్గు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. చైనా, అమెరికా, భారత్‌ల తర్వాత శిలాజ ఇంధనాల వినియోగంలో రష్యా, జపాన్, ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, కెనడా, యుకెలు పోటాపోటీగా ముందుకు సాగుతున్నాయి. పెరుగుతున్న పారిశ్రామీకరణ, అర్బనైజేషన్, వ్యవసాయ రంగంలో విస్తరిస్తున్న రసాయనిక మందుల వాడకం, వ్యవసాయ వ్యర్థాల దహనం వలన వాయు కాలుష్యం విపరీతంగా పెరిగి పోతున్నది.కార్బన్ డయాక్సైడ్,మిథేన్,నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువులను గ్రీన్ హౌస్ వాయువులంటారు. ఈ వాయువుల వలన భూవాతావరణం వేడెక్కి అనేక సమస్యలకు కారణమవుతున్న మాట సత్యదూరం కాదు. అధిక ఉష్ణోగ్రతలకు కారణమవుతూ, వాతావరణం ఆకస్మిక మార్పులకు లోనుకావడం వంటి పరిణామాలను గుర్తించాలి. పెరిగిపోతున్న గ్రీన్ హౌస్ వాయువుల శాతాన్ని తగ్గించి, గ్లోబల్ వార్మింగ్ విషయంలో ప్రపంచ దేశాలు దృష్టి సారించాలి.సహజ ఇంధన వనరుల స్థానంలో చౌకగా లభించే ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలి. శిలాజ ఇంధన వనరుల లభ్యత ఆందోళన కరమైన స్థితికి చేరుకుంటున్న నేపథ్యంలో భవిష్య పరిణామాలను ఆకళింపు చేసుకుని సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని పెంచాలి. పైగా ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఇంధనాల వలన ప్రపంచంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నది. బొగ్గు వలన అధికంగా కాలుష్యం వెలువడుతున్నది. అమెరికా విద్యుత్ ఉత్పత్తిలో 44 శాతం బొగ్గును వినియోగిస్తున్నారు. బొగ్గు వలన కర్బన ఉద్గారాలు అధికం మొత్తంలో విడుదల కాబడి, గ్లోబర్ వార్మింగ్ పెరుగుదలకు కారణం కావడం ఆందోళనకరం. విచ్చలవిడిగా ఇంధన వనరులను ఉపయోగిస్తూ ప్రపంచాన్ని ముందుకు తీసుకుపోతున్నామని భ్రమించినవారికి తరిగిపోతున్న ఇంధన వనరులను చూసి, భవిష్యత్ అవసరాలపై ఆందోళన అవసరం లేదా? ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడకంపై అవగాహన పెరుగుతున్నది. దశాబ్దకాలం ముందు ప్రపంచం మేల్కొన్ని ఉంటే ప్రస్తుతం నెలకొంటున్న అవాంఛనీయ పరిణామాలకు ఆస్కారం ఉండేది కాదు. పర్యావరణ సంబంధిత సమస్యలే కాకుండా తరిగిపోతున్న సాంప్రదాయ ఇంధన నిక్షేపాలను కాపాడుకుని ఉండేవారం.

# డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం.. 4 భారతీయ కంపెనీలపై నిషేధం!




తొలిఅడుగు, : ఈ కంపెనీల కార్యకలాపాల ద్వారా ఇరాన్ కార్యకలాపాలకు నిధులు సమకూరుతున్నాయి. నిషేధించిన నౌకలు వందల మిలియన్ల డాలర్ల విలువైన పది లక్షల బ్యారెళ్ల ముడి చమురును రవాణా చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ భద్రతకు ముప్పు కలిగించేలా ఇరాన్ తన అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తుందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా నాలుగు భారతీయ కంపెనీలను నిషేధించింది.ఖూ స్టేట్ డిపార్ట్‌మెంట్ సోమవారం (ఫిబ్రవరి 24, 2025) నాడు ఈ ప్రకటన చేసింది. ఇరాన్ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల వ్యాపారంలో ఈ కంపెనీలు పాల్గొన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. అలాగే ఇరాన్‌కు చమురు అమ్మకాలను నిలిపివేయడానికి ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం, అమెరికా విదేశాంగ శాఖ ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. వివిధ దేశాలలో 30 కంటే ఎక్కువ మంది వ్యక్తులతోపాటు నౌకలపై నిషేధం విధించాయి. ఈ జాబితాలో భారతదేశానికి చెందిన నాలుగు కంపెనీలు కూడా ఉన్నాయి. రాఖీూజ, ఖూ స్టేట్ డిపార్ట్‌మెంట్ నుండి అందిన సమాచారం ప్రకారం, ఆ నాలుగు భారతీయ కంపెనీలు - నవీ ముంబైకి చెందిన ఫ్లక్స్ మారిటైమ్ ూూ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌కి చెందిన దూవీ మెరైన్ ూూ, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు తంజావూరుకు చెందిన కాస్మోస్ లైన్స్ ఇంక్. నాలుగు కంపెనీలలో మూడు ఇరానియన్ చమురు, పెట్రోలియం ఉత్పత్తుల రవాణాలో సాంకేతిక నిర్వాహకులుగా ఉన్నందున నిషేధించారు. అయితే ఇరానియన్ పెట్రోలియం రవాణాలో దాని ప్రమేయం కోసం కాస్మోస్ లైన్స్ నిషేధించినట్లు అమెరికా పేర్కొంది. నిషేధిత జాబితాలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), హాంకాంగ్ నుండి చమురు మధ్యవర్తులు, భారత్ , పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా, ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ అధిపతి, ఇరానియన్ ఆయిల్ టెర్మినల్స్ కంపెనీ నుండి ట్యాంకర్ ఆపరేటర్లు, మేనేజర్లు ఉన్నారని రాఖీూజ తన ప్రకటనలో తెలిపింది. ఈ కంపెనీల కార్యకలాపాల ద్వారా ఇరాన్ కార్యకలాపాలకు నిధులు సమకూరుతున్నాయి. నిషేధించిన నౌకలు వందల మిలియన్ల డాలర్ల విలువైన పది లక్షల బ్యారెళ్ల ముడి చమురును రవాణా చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ భద్రతకు ముప్పు కలిగించేలా ఇరాన్ తన అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తుందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఇరాన్ చమురు ఎగుమతులు అనేక అధికార పరిధిలో చట్టవిరుద్ధంగా జరుగుతున్నాయని వెల్లడించింది. ట్రంప్ పరిపాలన తీసుకున్న ఈ చర్యలు ఇరాన్ అస్థిరపరిచే కార్యకలాపాలను ఆపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్



తొలిఅడుగు, : దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిసాయి. సెన్సెక్స్ ఐదు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్ల లాభాలతో 147.71 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ 74,602.12 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో ఫార్మా, మెటల్, ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నిఫ్టీ మాత్రం వరుసగా ఆరో రోజూ స్వల్పంగా 5.8 పాయింట్లు నష్టపోయి 22,547.55 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 17 కంపెనీల షేర్లు లాభాలతో, 13 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ఆసియా, అమెరికా మార్కెట్లు బలహీనంగా ఉండడం, కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలతో మదుపరులెవరూ కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, ట్రంప్ సుంకాల హెచ్చరికలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. కాగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ మంగళవారం నాన్ కన్వర్టబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు మరోసారి 'బేర్'మంది. మంగళవారం ఉదయం డాలర్‌తో 11 పైసల నష్టంతో రూ.86.83 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 47 పైసల నష్టంతో రూ.87.19 వద్ద ముగిసింది. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.86.85-87.40 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. ముడి చమురు ధర మరింత తగ్గితే తప్ప ఇప్పట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకునే అవకాశం కనిపించడం లేదు.





# కూరగాయలకే రారాజు.. ఆరోగ్య ప్రయోజనాలు



**తొలిఅడుగు, ఆరోగ్యం :** ఎముకలు ధృడంగా తయారవుతాయి. ఎముకల సాంద్రత పెరుగుతుంది. అలాగే వంకాయలోని పోషకాలు చర్మాన్ని, జుట్టును, గోళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో మేలు చేస్తాయి. వంకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది. వంకాయ తినడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వంకాయలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. కేలరీలు తక్కువగా ఉండే వంకాయ తినడం వల్ల బరువు తగ్గటం ఈజీ అవుతుంది. వంకాయ గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యల నుండి రక్షిస్తుంది. వంకాయలో విటమిన్ కె, విటమిన్ బి6, పొటాషియం, మాంగనీస్, ఫోలేట్, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. వంకాయలను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వంకాయలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటం ద్వారా శరీరాన్ని రక్షిస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.. వంకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీరాడికల్స్ ను నశింపజేసి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడడంలో సహాయపడతాయి. వంకాయలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.. సులువుగా బరువు తగ్గవచ్చనని నిపుణులు చెబుతున్నారు. వంకాయ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వంకాయలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వంకాయలను తరచూ మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల కంటి సమస్యలు తగ్గడంతో పాటు కంటి చూపు మెరుగు పడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎముకలు ధృడంగా తయారవుతాయి. ఎముకల సాంద్రత పెరుగుతుంది. అలాగే వంకాయలోని పోషకాలు చర్మాన్ని, జుట్టును, గోళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో మేలు చేస్తాయి. వంకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది. వంకాయ తినడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

# శరీరంలో మలినాలు చిటికెలో క్లీన్ చేసే కూరగాయ..




**తొలిఅడుగు, ఆరోగ్యం :** ముల్లంగి శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. శీతాకాలంలో రోగనిరోధక శక్తి సహజంగానే తగ్గుతుంది. ఫలితంగా వివిధ ఇన్ఫెక్షన్లు, ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. సులభంగా అనారోగ్యానికి గురవుతారు. ఈ సమస్యలను నివారించాలనుకుంటే శీతాకాలంలో అప్పుడప్పుడు ముల్లంగి తినాలి. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ముల్లంగి వాసన కాస్త వెగటుగా ఉంటుంది. ఈ కారణంగానే చాలా మంది దీనిని తినడానికి ఇష్టపడరు. గ్యాస్ సమస్యలు ఉన్నవారు దీనిని తింటే ఈ సమస్య ఇంకా ఎక్కువ అవుతుంది. ఈ కూరగాయ శీతాకాలంలో ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అయితే దీనిని వంటల్లో వినియోగిస్తే రుచికరంగా ఉండటమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ముల్లంగి శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. శీతాకాలంలో రోగనిరోధక శక్తి సహజంగానే తగ్గుతుంది. ఫలితంగా వివిధ ఇన్ఫెక్షన్లు, ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. సులభంగా అనారోగ్యానికి గురవుతారు. ఈ సమస్యలను నివారించాలనుకుంటే శీతాకాలంలో అప్పుడప్పుడు ముల్లంగి తినాలి. ముల్లంగి శరీర నిర్విషీకరణకు సహాయపడుతుంది. కాబట్టి మీరు సలాడ్‌లో పచ్చి ముల్లంగిని తినవచ్చు. అయితే గ్యాస్ సమస్యలున్నవారు ముల్లంగిని తేలికగా ఉడకబెట్టి తినాలి. ఇది సులభంగా జీర్ణమవుతుంది. పచ్చిగా తింటే సమస్య తీవ్రం అవుతుంది. ముల్లంగిలో పొటాషియం ఉంటుంది. అందువల్ల ఈ కూరగాయ తినడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటే స్ట్రోక్, గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. ముల్లంగిలో విటమిన్ సి ఉంటుంది. ఇందులో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ముల్లంగి శీతాకాలంలో సాధారణ శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడానికి ఇది సహాయపడుతుంది.

# వెల్లుల్లి తొక్కతో పాటు తింటే ఏమవుతుంది?



**తొలిఅడుగు, ఆరోగ్యం :** వెల్లుల్లి రెబ్బలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో దాదాపు మనందరికీ తెలుసు. వెల్లుల్లిని మంచి రుచి, ఆరోగ్యం కోసం ఉపయోగిస్తారు. ఘాటైన వెల్లుల్లి లేకుండా దాదాపు ఏ వంటకం పూర్తి కాదనే చెప్పాలి. తరచూ వెల్లీని తినడం వల్ల శరీరం అనేక వ్యాధుల నుండి రక్షింపబడుతుంది. అయితే, అందరూ వెల్లుల్లి రెబ్బలను మాత్రమే ఉపయోగిస్తూ వాటి పొట్టును బయట పారేస్తుంటారు. కానీ, వెల్లుల్లితో పాటు వెల్లుల్లి పొట్టులో కూడా ఆరోగ్యానికి మేలు చేసే అనేక రకాల ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి పొట్టులోని ఔషధగుణాలు, ఆరోగ్యప్రయోజనాలు తెలిస్తే అస్సలు పడేయరంటున్నారు ఆయుర్వేద నిపుణులు. వెల్లుల్లి తొక్కతో పాటు తినడం వల్ల మన ఆరోగ్యానికి, శరీరానికి ఎంతో మేలు జరుగుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లిలో ఎన్ని పోషకాలు ఉన్నాయో... వెల్లుల్లి తొక్కల్లో కూడా సమాన పోషకాలు ఉంటాయని చెబుతున్నారు. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్ల కోసం ఈ తొక్కలను తినడం చాలా అవసరం అంటున్నారు. వెల్లుల్లి తొక్కల్లో విటమిన్ ఏ, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల పొట్టుతో పాటు శరీరంలో చేరుతాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను కాపాడతాయి. ఇది లిపిడ్ స్థాయిలను తగ్గిస్తాయి. వెల్లుల్లి తొక్కలో సల్ఫర్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తపోటు తగ్గుతుంది. వెల్లుల్లి తొక్కలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. ఇవన్నీ శరీరంలోని హానికరమైన టాక్సిన్లు, ఫ్రీ రాడికల్స్ తో పోరాడతాయి. వీటిని తినడం వల్ల ఇన్ఫ్లమేషన్ వంటి సమస్యలు కూడా రావని సూచిస్తున్నారు. గుండెజబ్బులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. రక్తనాళాలు బిగుసుకుపోకుండా విస్తరించేలా ఉంటాయి. దీని వల్ల హైబీపీ రాకుండా ఉంటుంది. వెల్లుల్లి తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది మరియు మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు వెల్లుల్లి తినాలి. వెల్లుల్లి తినడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రక్తంలో కొలెస్ట్రాల్ మొత్తాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వారు వెల్లుల్లి తొక్కను ఆహారంలో భాగంగా చేసుకోండి. దీనిలో యాంటీ మైక్రోబయాల్ గుణాలు ఉంటాయి. బ్యాక్టీరియాతో పోరాడే శక్తిని అందిస్తాయి. జుట్టుకు మాడుకు ఇవి హాని కలగకుండా చూస్తాయి. వెల్లుల్లి తొక్కలో ఉండే ప్రోటీన్లు చర్మంలో కొలాజెన్ పెంచడానికి సహాయపడతాయి. వెల్లుల్లి తొక్కలను ఎండబెట్టి పొడి చేసి ఆ పొడిని పెరుగులో కలిపి ఫేస్ ప్యాక్ లా వాడడం వల్ల చర్మం యవ్వనంగా మెరిసిపోతూ ఉంటుంది. గీతలు, ముడతలు వంటివి రాకుండా ఉంటాయి.

# బరువు తగ్గాలనుకుంటున్నారా?




**తొలిఅడుగు, ఆరోగ్యం :** : ఖర్జూరాలు రుచికే కాదు ఆరోగ్యానికి కూడా బలేగా పనిచేస్తాయి. మన దేశంలో అనేక రకాల ఖర్జూరాలు పండిస్తారు. వీటి పరిమాణం, రుచి, పోషక విలువలలో చాలా మార్పులు ఉంటాయి. అయితే బరువు తగ్గడానికి కూడా ఖర్జూరాలు ఉపయోగపడతాయని మీకు తెలుసా? ఖర్జూరం రుచికరమైన సూపర్ ఫుడ్ మాత్రమే కాదు.. ఇవి ప్రత్యేకమైన పోషకాలతో నిండి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల ఖర్జూరాలు ఉన్నాయి. ప్రతి ఒక్కటి విభిన్నమైన రుచి, ఆకృతి, పోషకాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం, బరువు తగ్గడం విషయానికి వస్తే తదనుగుణమైన ఖర్జూరాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. మీరు ఆరోగ్యకరమైన రీతిలో బరువు తగ్గాలనుకుంటే, మీ ఆరోగ్యానికి ఏ రకమైన ఖర్జూరాలు ప్రయోజనకరంగా ఉంటాయో ముందుగా తెలుసుకోవాలి. నేడు మన దేశంలో డెగ్లెట్ నూర్, బర్హి (పాక్షికంగా ఎండిన, పండిన), అజ్వా, మెడ్జూల్, సుక్కరి వంటి 6 రకాల ప్రధాన ఖర్జూర రకాలు ఉన్నాయి. అజ్వా ఖర్జూరాలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వును తగ్గించే ఆహారానికి ఇవి మంచి ఎంపిక. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది అతిగా తినడాన్ని నివారిస్తుంది. శరీరంలోని జీవక్రియను వేగవంతం చేసి చెడు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇతర ఖర్జూరాలతో పోలిస్తే వీటిలో చక్కెర శాతం తక్కువగా ఉండటం వల్ల ఇవి బరువు తగ్గడానికి మంచివి. ఇందులో అధిక ఫైబర్ కారణంగా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొవ్వు నష్టం ప్రక్రియను వేగవంతం చేస్తుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అంత త్వరగా పెరగవు. ఇది కొవ్వు నిల్వను తగ్గిస్తుంది.

బర్హి ఖర్జూరాలు చాలా తీపిగా ఉంటాయి. ఇది చాలా మృదువుగా, జ్యుసిగా ఉంటుంది. రుచిలో తేనెను పోలి ఉంటుంది. ఇది తినడానికి చాలా రుచికరంగా ఉండటమే కాకుండా, ఇతర ఖర్జూరాలతో పోలిస్తే ఇందులో అత్యధిక చక్కెర శాతం కూడా ఉంటుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే, దీనిని తినకపోవడమే మంచిది. మెడ్‌జూల్ ఖర్జూరాలను ఖర్జూరాలలో రారాజు అని పిలుస్తారు. ఇది పరిమాణంలో చాలా పెద్దది. పంచదార పాకంలా రుచిగా ఉంటుంది. కానీ ఇందులో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఒక మెడ్‌జూల్ ఖర్జూరంలో 70కిపైగా కేలరీలు ఉంటాయి. అయితే దీన్ని తినడం వల్ల మీకు తక్షణ శక్తి లభిస్తుంది.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# పూజా హెగ్డేను అలా చూసి తట్టుకోగలరా?



తొలిఅడుగు, సినిమా: పూజా హెగ్డే హీరోయిన్‌గా అరంగేట్రం చేసి దశాబ్దం దాటింది. కానీ ఇన్నేళ్లు గడిచినా ఆమెను ఒక గ్లామర్ హీరోయిన్‌గానే చూస్తున్నారు. ఆమె నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేసింది తక్కువ. 'అరవింద సమేత' లాంటి కొన్ని చిత్రాల్లో మాత్రమే కొంత నటనకు ప్రాధాన్యం లభించింది. అలాంటి పాత్రల్లోనూ ఆమె గ్లామరే హైలైట్ అయింది తప్ప.. నటన గురించి పెద్దగా మాట్లాడుకోలేదు. అందం కోణంలో తప్ప నటన కోసం చూడని కొద్దిమంది హీరోయిన్లలో పూజా ఒకరని చెప్పాలి. అలాంటి హీరోయిన్లను డీగ్లామరస్, పెయిన్ ఫుల్ క్యారెక్టర్లలో చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడరు కూడా. గతంలో కాజల్ అగర్వాల్ కూడా ఈ కోవకే చెందేది. ఐతే పూజా కెరీర్లో తొలిసారిగా డీగ్లామరస్ రోల్ చేయబోతోందని.. ఆమెను ఒక షాకింగ్ క్యారెక్టర్లో రాఘవ లారెన్స్ చూపించబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. కాంచన సిరీస్‌లో నాలుగో సినిమా తీయడానికి రాఘవ లారెన్స్ రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డేను కథానాయికగా ఎంచుకున్నాడు. ఆమె ఈ సినిమాలో చెవిటి-మూగ అమ్మాయిగా కనిపించబోతోందనే వార్త ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పూజా లాంటి గ్లామర్ హీరోయిన్ ఇలాంటి పాత్ర చేయడం ఏంటి అని తన ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు. ఇంతకుముందు 'గంగ' (కాంచన-3)లో సినిమాలో నిత్యా మీనన్‌ను దివ్యాంగురాలిగా చూపిస్తే బాగానే కుదిరింది.

# వంగ ఇంటర్వ్యూ ఇస్తే.. బాలీవుడ్ షేకే



తొలిఅడుగు, సినిమా: సందీప్ రెడ్డి వంగ.. ఈ పేరు చెబితే చాలు కొంతమంది బాలీవుడ్ జనాలు షేకైపోతారు. అతను తీసే సినిమాలు మాత్రమే కాదు.. తన ఇంటర్వ్యూలు సైతం బాలీవుడ్ వాళ్లకు నిద్ర పట్టనివ్వవు. తెలుగులో 'అర్జున్ రెడ్డి'లో ప్రకంపనలు సృష్టించాక.. ఆ చిత్రాన్ని 'కబీర్ సింగ్'గా హిందీలో రీమేక్ చేస్తే అక్కడా బ్లాక్ బస్టర్ అయింది. కానీ ఇందులో పురుషాధిక్యతను గ్లోరిఫై చేశాడని.. సమాజాన్ని తప్పుదోవ పట్టించేశాడని ఇటు బాలీవుడ్ జనాలు, అటు క్రిటిక్స్ లబోదిబోమన్నారు. బాలీవుడ్లో దీన్ని మించిన చెడు పోకడలు ఎన్నో సినిమాల్లో చూసినప్పటికీ.. 'కబీర్ సింగ్'ను మాత్రమే టార్గెట్ చేయడం విడ్డూరం. ఇక తన తర్వాతి చిత్రం 'యానిమల్'ను బాలీవుడ్ ఎలా టార్గెట్ చేసిందో తెలిసిందే. లెజెండరీ లిరిసిస్ట్, రైటర్ జావెద్ అక్తర్ సహా చాలామంది ఆ సినిమాను తీవ్రంగా విమర్శించారు. ఇక క్రిటిక్స్ సంగతైతే చెప్పాల్సిన పనే లేదు. కానీ వాళ్లందరికీ కేవలం తన సినిమా వసూళ్లతోనే కాదు.. తన ఇంటర్వ్యూలతోనూ ఘాటుగానే సమాధానం చెప్పాడు సందీప్. తన సినిమాలను తప్పుబట్టే వాళ్లకు ఇంటర్వ్యూల్లో సందీప్ వేసే ప్రశ్నలు.. చాలా గట్టిగానే తగులుతుంటాయి. వాటికి అవతలి వైపు నుంచి సమాధానమే ఉండదు. బాలీవుడ్ జనాల హిపోక్రసీని అతను భలేగా బయటపెడుతుంటాడు. తాజాగా సందీప్.. కోమల్ నహతా అనే క్రిటిక్ కమ్ ట్రేడ్ అనలిస్ట్‌కు ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడు. అది కేవలం ప్రోమోతోనే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది.

# వీరమల్లు కోసం గుర్రపు స్వారీ చేసిన నిధి

తొలిఅడుగు, సినిమా ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక పవన్ కళ్యాణ్ నుంచి వస్తున్న మొదటి సినిమాగా హరిహర వీరమల్లు మీద క్రమంగా అంచనాలు ఊపందుకుంటున్నాయి. మూడేళ్ళ నిర్మాణం వల్ల హైప్ కొంచెం తక్కువగా ఉందని ఫ్యాన్స్ ఫీలవుతున్నా వాళ్ళ ఊహలకు ఏ మాత్రం అందని రీతిలో విజువల్ గ్రాండియర్ ఉంటుందని యూనిట్ సభ్యులు ఊరిస్తున్నారు. ఇప్పటిదాకా రెండు పాటలు వచ్చేశాయి. మాట వినాలి గురుడా మాట వినాలి క్రమంగా ఎక్కుతుండగా, కొల్లగొట్టినాదిరో మాస్ ఆడియన్స్ కి నచ్చేస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ నిధి అగర్వాల్ ఈ మూవీలో తను పోషిస్తున్న పంచమి పాత్రతో పాటు మరికొన్ని ముచ్చట్లు పంచుకుంది. ఇంకొక్క పాటకు సంబంధించి కేవలం రెండు రోజుల షూట్ మాత్రమే నిధికి పెండింగ్ ఉంది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ కు మంచి డాన్స్ సీక్వెన్సులు ఇందులో ఉండబోతున్నాయి. వాటికి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఇంకా వదల్లేదు. గతంలో నిర్వహించిన వర్క్ షాప్ లో ప్రాక్టీస్ ఆల్రెడీ అయిపోయింది కాబట్టి ఇకపై టైం వేస్ట్ చేయడం లాంటివి ఉండవు. వీరమల్లు కోసం ప్రత్యేకంగా గుర్రపు స్వారీ, క్లాసికల్ డాన్స్ నేర్చుకుంది నిధి అగర్వాల్. పంచమి ఫ్లాట్ క్యారెక్టర్ కాదు. బోలెడు ట్విస్టులు, షేడ్స్, మలుపులు ఉంటాయి. రెండో భాగానికి సంబంధించిన కొన్ని ఎపిసోడ్స్ ఆల్రెడీ షూట్ చేయడం అయిపోయింది. చూశారుగా పంచమి చెప్పుకునే కబుర్లు.



# టాలీవుడ్‌కు కొత్త అందం భైరవి

తొలిఅడుగు, సినిమా టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతోంది. అందం, అభినయం కలగలిసిన భైరవి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతోంది. 'సర్కార్ నౌకరి' ఫేమ్, ప్రముఖ సింగర్ సునీత తనయుడు ఆకాష్ హీరోగా తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై చేస్తున్న ప్రొడక్షన్ నెంబర్ 1 మూవీలో హీరోయిన్‌గా భైరవి నటించింది. ఇది ఆమెకు డెబ్యూ మూవీ అయినప్పటికీ తన ప్రతిభతో ఎంతో పరిణితితో నటించింది. సెంటిమెంట్, ఎమోషనల్ వంటి సీన్లలో భైరవి యాక్టింగ్ నెక్స్ లెవెల్‌లో ఉండబోతున్నట్టు చిత్ర యూనిట్ చెబుతోంది. సినిమా విడుదల తర్వాత భైరవి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోవడం ఖాయమని అంటున్నారు. శివ వరప్రసాద్ దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు నటించారు. ఈ సందర్భంగా నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ "ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో రూపొందిస్తున్నాం. రొమాంటిక్ లవ్, సస్పెన్స్ కామెడీ చిత్రమిది. ప్రస్తుతం మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. త్వరలోనే సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటిస్తాం"అని అన్నారు.



# న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు దూరం కానున్న టీమిండియా స్టార్ ప్లేయర్?



**తొలిఅడుగు,:** ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఇప్పటి వరకు 2 మ్యాచ్‌లు ఆడింది. రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం ద్వారా టీమిండియా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు రోహిత్ అండ్ కంపెనీ తదుపరి మ్యాచ్ న్యూజిలాండ్‌తో మార్చి 2న జరగనుంది. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా అతిపెద్ద మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్‌కు రెస్ట్ ఇవ్వాలనే చర్చ జరుగుతోంది. ఈ మేరకు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ డారెన్ గోఫ్ ఓ సలహా ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో మూడో లీగ్ మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ డారెన్ గోఫ్ మాట్లాడుతూ.. టీమిండియా బహుశా షమీకి విశ్రాంతి ఇవ్వొచ్చు. పాకిస్థాన్‌పై టీమిండియా అద్భుతంగా రాణించింది. జట్టుకు మంచి బ్యాటింగ్ లైనప్ ఉన్నప్పుడు మరో స్పిన్నర్‌ని ప్రయత్నించవచ్చు. దుబాయ్‌లో మరొక స్పిన్నర్‌ని తీసుకోవచ్చు. టీమ్ ఇండియా ఇప్పటికే సెమీ-ఫైనల్‌కు అర్హత సాధించింది. కాబట్టి న్యూజిలాండ్‌తో మ్యాచ్ కేవలం నామమాత్రంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితిలో కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్ నుండి ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి విశ్రాంతి ఇవ్వొచ్చని ఆయన అంచనా వేశారు. చాలా కాలం తర్వాత మహ్మద్ షమీ మళ్లీ టీమ్ ఇండియాలోకి వచ్చాడు. బంగ్లాదేశ్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్ ప్రదర్శించిన షమీ ఈ మ్యాచ్‌లో 5 వికెట్లు తీశాడు. పాకిస్థాన్‌పై షమీ బౌలింగ్ బాగానే ఉంది. ఈ మ్యాచ్‌లో షమీ 8 ఓవర్లలో 43 పరుగులు చేసినప్పటికీ అతనికి వికెట్ దక్కలేదు. షమీ మ్యాచ్ ప్రారంభంలో కొంత ఇబ్బంది పడుతూ కనిపించాడు. దీని కారణంగా అతను కొంత సమయం మైదానం నుండి బయటకు వెళ్లవలసి వచ్చింది. మరి న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో షమీకి విశ్రాంతినిస్తారా లేదా అనేది చూడాలి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన టీమిండియా విజయం సాధించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించగా.. ఫిబ్రవరి 23న పాక్‌తో జరిగిన పోరులో భారత్ జట్టు ఘనవిజయం సాధించి సెమీస్‌కు బెర్త్‌ను ఖరారు చేసుకుంది. టీమిండియా తన తదుపరి మ్యాచ్‌ను మార్చి 2వ తేదీన కివీస్‌తో ఆడనుంది.

# చెలరేగిన ఢిల్లీ బౌలర్లు




**తొలిఅడుగు,:** మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో గుజరాత్ జెయింట్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ కెప్టెన్ లానింగ్ నమ్మకాన్ని బౌలర్లు వమ్ము చేయలేదు. ఢిల్లీ బౌలర్లు శిఖా పాండే(2/18), మారిజన్ కాప్(2/17), (4-1-17-2), అన్నాబెల్ సదర్‌ల్యాండ్(2/20)కి తోడు టిటాస్ సధు, జెస్ జొనాస్సెన్ తలా ఒక వికెట్‌తో చెలరేగారు. దీంతో గుజరాత్‌ను 127పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 15.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 131పరుగులు చేసి విజయం సాధించింది. ఢిల్లీ బ్యాటర్లు జొన్నాసెన్(61బీ 32బంతుల్లో 9ఫోర్లు, 2 సిక్సర్లు), షెఫాలీ వర్మ(44బీ 27బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లు) కీలకపాత్ర పోసించారు. అంతకుముందు గుజరాత్ బ్యాటర్లలో భారతి ఫుల్మలి (40నాటౌట్‌బీ 29బంతుల్లో, 4ఫోర్లు, 2సిక్సర్లు) ఒక్కరే చెప్పుకోదగ్గ స్కోర్ చేసింది. భారతి ఇన్నింగ్స్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచింది. ఆ తర్వాత డియాండ్రా డొటిన్(26), తనూజా కన్వర్(16), బెత్ మూనీ(10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. హర్లీన్ డియోల్ 5, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 0, కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ 3, కశ్వీ గౌతమ్ 0, సిమ్రన్ షేక్ 5, మేఘనా సింగ్ 0 పరుగులకు ఔటయ్యారు. ప్రియా మిశ్రా ఒక్క పరుగుతో అజేయంగా నిలిచింది.

# నెదర్లాండ్స్‌కు మహిళల జట్టు ఝలక్




**తొలిఅడుగు,** ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సత్తా చాటాయి. సోమవారం ఇంగ్లండ్ చేతిలో పురుషుల జట్టు, నెదర్లాండ్స్ చేతిలో మహిళల జట్లు ఓటమిపాలవ్వగా.. మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో మహిళలజట్టు షూట్-ఆఫ్‌లో ఒలింపిక్ ఛాంపియన్ నెదర్లాండ్స్‌కు ఝలక్ ఇవ్వగా.. ఇంగ్లండ్ జట్టుపై పురుషుల జట్టు 2-1 గోల్స్‌తో విజయం నమోదు చేసుకుంది. కళింగ హాకీ స్టేడియంలో తొలుత జరిగిన మహిళల మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా ఉండగా.. షూట్ ఆఫ్‌లో దీపిక, ముంతాజ్ ఖాన్‌లో గోల్స్ చేయగా.. నెదర్లాండ్స్ తరఫున మారిజ్ వీస్ మాత్రమే గోల్ చేయగల్గింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 2-4గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఇక పురుషుల జట్టు రెండో క్వార్టర్ ముగిసేసరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. మూడో క్వార్టర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీని గోల్‌గా మలచడంతో భారత్ 2-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. భారత్ తరఫున తొలి గోల్‌ను హర్మన్‌ప్రీత్, ఇంగ్లండ్ తరఫున తొలి గోల్‌ను విలియమ్సన్ కానర్ చేశారు.

# కొంపముంచిన వాన.. ఆసీస్, సఫారీ మ్యాచ్ రద్దు



**తొలిఅడుగు,** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా రావల్పిండి స్టేడియం వేదికగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య జరిగాల్సిన మ్యాచ్ టాస్ పడకుండా వర్షం కారణంగా రద్దైంది. సోమవారం టాస్ పడే సమయానికి వర్షం కాస్త తెరిపి ఇచ్చిన.. ఆ తర్వాత వెంటనే కురవడం మొదలైంది. అయితే వర్షం తగ్గగానే మ్యాచ్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో కనీసం 20 ఓవర్ల మ్యాచ్ అయినా.. నిర్వహిస్తారని అంతా అనుకున్నారు. కానీ, వర్షం మాత్రం ఏ మాత్రం తగ్గు ముఖం పట్టలేదు. దీంతో మ్యాచ్‌ని రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్‌ను ఇచ్చారు. దీంతో ఇప్పటికే గ్రూప్-బిలో చెరో మ్యాచ్ గెలిచిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు ఖాతాలో మూడు, మూడు పాయింట్లు చేరాయి. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా ఆడిన చివరి ఎనిమిది మ్యాచుల్లో నాలుగు రద్దు కావడం.. లేదా ఫలితం రాకుండా ఉండిపోవడం విశేషం. అయితే గ్రూప్-బిలో పాయింట్ల పట్టికలో చివరి రెండు స్థానాల్లో ఉన్న ఇంగ్లండ్, అఫ్ఘానిస్థాన్‌కు బుధవారం జరిగే మ్యాచ్ కీలకమైంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోయిన జట్టు ఆ తర్వాత మ్యాచ్ గెలిచినా లాభం ఉండదు. ఆ జట్టు భవిష్యత్తు ఇతర జట్ల గెలుపోటములపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు నెట్‌రన్ రేటుతో ప్రథమ స్థానంలో ఉన్న సౌతాఫ్రికా మాత్రం తర్వాతి మ్యాచ్‌లో నెగ్గితే.. నేరుగా సెమీఫైనల్‌కు వెళ్లనుంది.